నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ మంగళవారం 23 జూలై 2024 | ADILABAD NIRMAL


## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ


సీసీ కెమెరాలో రికార్డ్ అయిన దొంగ కదలికలు

ఖానాపూర్ టౌన్, జూలై 22 : పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి తర్వాత తాళం వేసి ఉన్న మూడు ఇళ్లలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మావతినగర్ కాలనీలో నివాసం ఉంటున్న సంపత్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి తమ బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగ ఇంటికి వేసిన తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న 5 గ్రాముల బంగారు కమ్మలను దొంగిలించాడు. అనంతరం అదే కాలనీలోని కామోజీ శ్రీనివాస్, చిలుకూరి విజయ్ ప్రకాశ్ ఇండ్లలో కూడా తాళాలు పగులగొట్టి దొంగతనానికి యత్నించాడు. ఓ ఇంటిలో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలో దొంగతనం చేసిన వ్యక్తి కదలికలు స్పష్టంగా కన్పించాయి. చోరీకి గురైన ఇండ్లను సీఐ సైదరావు సిబ్బందితో కలిసి పరిశీలించాడు. సంపత్‌రావు వరసకు తమ్ముడు అయిన చినబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్వర్ణ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల


లెఫ్ట్ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేస్తున్న ఈఈ లక్ష్మి

సారంగాపూర్, జూలై 22 : స్వర్ణ ప్రాజెక్టు ద్వారా ఖరీఫ్ పంటకు సోమవారం ఇరిగేషన్ ఈఈ లక్ష్మి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయకట్టు రైతులు వరి నాట్లకు సన్నద్ధం కావాలని సూచించారు. అనంతరం లెఫ్ట్ కెనాల్ ద్వారా 10 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇందులో డీఈఈ శ్రీనివాస్, ఎంపీడీవో లక్ష్మీకాంతారావు, డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, ఏఈలు మధుపాల్, దేవేందర్, బీజేపీ నాయకులు కరిపె విలాస్, రామ్‌శంకర్‌రెడ్డి, సాహెబ్‌రావు, మంతెన గంగారెడ్డి, తిరుమలాచారి, వెంకటేశ్, కరుణాసాగర్‌రెడ్డి, బడి పోతన్న, ఎల్లన్న, ముత్యంరెడ్డి, కొరిపెల్లి రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.


చిత్రపటాల వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

## సేవా కార్యక్రమాలు చేయడం అందరితో కాదు

**మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న**

ఎదులాపురం, జూలై 22 : సేవా కార్యక్రమాలు చేయడం అందరితో సాధ్యం కాదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. సోమవారం కేఆర్‌కే కాలనీలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. దాన్‌పెల్లి గంగన్న-పోచ్చుబాయి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రామన్న ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా గంగన్న-పోచ్చుబాయి చిత్రపటాల వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోవర్ధన్, విజ్జగిరి నారాయణ, నవతె శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పేదలకు వరం కల్యాణలక్ష్మి

**బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్**

బోథ్, జూలై 22 : కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు వరం అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం బోథ్ రైతు వేదికలో వివిధ గ్రామాలకు చెందిన 26 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా పేదింటి ఆడబిడ్డల పెండ్లి కోసం రూ.1,00,116ల ఆర్థిక సహాయాన్ని కేసీఆర్ సర్కారు మొదలు పెట్టిందన్నారు. ఇటీవల కొత్తగా పట్టాలు చేసుకున్న రైతులు ఆగస్టు 5వ తేదీలోగా రైతుబీమా కోసం సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుభాష్ చందర్, ఎంపీడీవో రమేశ్, ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, తాజా మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ జడ్పీ కో-ఆప్షన్ మెంబర్ తాహెర్ బిన్ సలాం, బి.రాజు యాదవ్, రుక్మణ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## మళ్లీ వస్తా.. ఇలా ఉంటే కుదరదు

- అపరిశుభ్ర వాతావరణంలో వంటలు ఎలా చేస్తున్నారు?
- వంట పాత్రలు ఇలానే ఉండేది? మీ ఇంట్లో ఇలానే ఉంచుకుంటారా?
- మారకపోతే ఉన్నతాధికారులకు కూడా నోటీసులు ఇస్తం..
- వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీనియర్ సివిల్ జడ్జి సౌజన్య


వంటలను పరిశీలిస్తున్న డీఎల్ఎస్ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సౌజన్య

ఎదులాపురం, జూలై 22 : ''అపరిశుభ్ర వాతావరణంలో వంటలు ఎలా చేస్తున్నారు? మీ పిల్లలకు మీ ఇంటి ప్రదేశంలో ఇలా ఉంటే వంటలు చేసి పెడతారా? వంట పాత్రలు కడిగిన నీరు ఇక్కడే నిలిచి ఉంటుందా? ఈగలు అధిక సంఖ్యలో ఉన్నాయి? మరుగుదొడ్లు, పిచ్చిమొక్కలు ఇలానే ఉండేది?'' అని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బోనగిరి సౌజన్య వంట సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఆమె సందర్శించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల ప్రిన్సిపాల్ చాంబర్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం వంటశాల గదులను సందర్శించారు. మధ్యాహ్నం వంట సామగ్రిని పరిశీలించారు. మొదటిసారి తనిఖీ చేశా.. మళ్లీ వచ్చే సమయానికి ఇది మారకపోతే... మీతోపాటు ఉన్నతాధికారులకు నోటీసులు ఇవ్వాల్సి ఉంటుంది.

## ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఎదులాపురం, జూలై 22 : అమరవీరుల స్మృతి వనం, కేస్లాపూర్ నాగోబా దేవాలయ నిర్మాణం, కుంటాల జలపాతం వద్ద నిర్మించనున్న పనుల డిజైన్‌పై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ రాజర్షి షా ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నాగోబా జాతర కంటే ముందే అన్నదాన సత్రం పూర్తి చేయాలని, మూలమలుపు నుంచి దేవాలయం కనిపించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఏకో రిసార్ట్, కుంటాల జలపాతం వద్ద ఐదెకరాల్లో ఎనిమిది కాటేజ్‌లు, రిసెప్షన్ సెంటర్, డైనింగ్, పార్కింగ్, గెస్ట్‌హౌస్, పార్కులపై డిజైనర్ ప్రశాంత్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డిజైన్ ఫైనల్ చేయడం జరిగిందని పనులను త్వరగా ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

## ఇంటింటా ఇన్నోవేటర్ నూతన ఆవిష్కరణలు

నిర్మల్ చైన్‌గేట్, జూలై 22 : గ్రామీణ ప్రాంతాల నుంచి నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం తోడ్పాటును అందిస్తుందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఇంటింటా ఇన్నోవేటర్-2024 ఆరో విడుత కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆసక్తి ఉన్న వారు తమ నూతన ఆవిష్కరణలను ఆగస్టు 3వ తేదీలోపు వాట్సాప్ నంబర్ 9100678543కు ఆవిష్కర్త పేరు, చిరునామా, ఆవిష్కరణకు సంబంధించిన వివరాల ఫొటోలు, వీడియో రూపంలో తీసి పంపాలన్నారు. ఆగస్టు 15న ఉత్తమ ఆవిష్కరణలు ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఏవో అంజిప్రసాద్, డీఈవో రవీందర్‌రెడ్డి, డీపీఆర్వో విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

# సాగుకు ఊతం

**నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షం**

- పత్తి, సోయా, మక్క, పప్పు దినుసుల పంటలకు మేలు
- నాట్లకు సిద్ధమవుతున్న అన్నదాతలు
- కడెం, స్వర్ణ ప్రాజెక్టులకు జలకళ

నిర్మల్, జూలై 22(నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా నిర్మల్ జిల్లాలో నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఎండుముఖం పట్టిన ఆరుతడి పంటలకు ప్రాణం పోసినట్లు అయింది. ముఖ్యంగా పత్తి, సోయా, మక్కతోపాటు పప్పు దినుసుల పంటలకు మేలు చేసే అవకాశం ఉంది. ఈ వానకాలంలో 4,33,300 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. చాలా చోట్ల రైతులు జూన్‌లోనే సాగు చేశారు. సీజన్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు విత్తనాలు మొలకెత్తగా.. ఆ తర్వాత వానలు ముఖం చాటేయడంతో పత్తి, సోయా, మక్క ఎండిపోయే పరిస్థితి నెలకున్నది. ఈ క్రమంలోనే కురిసిన భారీ వర్షాలు ఆరుతడి పంటలతో పాటు, వరి వేసే రైతులకు ఊరట కలిగించాయి. ఇప్పటికే చాలా చోట్ల నార్లు పోసిన రైతులు నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సీజన్‌లో 1.35 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం కురిసిన వానలతో చెరువుల్లోకి పెద్దగా వరద నీరు చేరలేదు.


సారంగాపూర్ మండలం జాం గ్రామంలో నాట్లు వేస్తున్న కూలీలు


భైంసా మండలం ఖత్‌గాంలో పచ్చదనాన్ని పర్చుకున్న సోయా

జిల్లాలో 734 చెరువులు ఉండగా, వీటి పరిధిలో 71,832 ఎకరాల్లో వరి సాగవుతున్నది. ఇప్పటి వరకు ఆయా చెరువులు కేవలం 20-30 శాతం మాత్రమే నిండాయని అధికారులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురిస్తేనే చెరువుల కింద వరి పండే అవకాశాలు ఉన్నాయి. కడెం, స్వర్ణ ప్రాజెక్టులు నిండడంతో ఆయా ప్రాజెక్టుల కింద వరి సాగుకు ఢోకా లేదు.

### కడెం, స్వర్ణ ప్రాజెక్టులకు జలకళ

ఆదిలాబాద్, మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో కడెం, స్వర్ణ ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 691 అడుగులకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 7718 క్యూసెక్కులు ఉండగా, ఒక గేటును ఎత్తి 2958 క్యూసెక్కుల నీటిని దిగువనకు వదులుతున్నారు. ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా వానకాలం సాగు కోసం 298 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. స్వర్ణ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1183 అడుగులు కాగా, ప్రస్తుతం 1177.4 అడుగులకు నీటి నిల్వలు చేరుకున్నాయి. దీంతో సోమవారం ప్రాజెక్టు కింది ఆయకట్టు కోసం ఎడమ కాలువ ద్వారా 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

### నిర్మల్‌లో అత్యధిక వర్షపాతం

వానకాలంలో ఇప్పటివరకు 476.1 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అయితే గతేడాది ఇదే సమయానికి సగటు వర్షపాతం 519.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, ప్రస్తుతం 29 మి.మీ. లోటుగా ఉంది. అయితే ఇప్పటివరకు అత్యధికంగా నిర్మల్‌లో 640 మిల్లీ మీటర్లు, కుభీర్‌లో 431.9, తానూర్‌లో 376.3, బాసరలో 562.5, ముథోల్‌లో 408.7, భైంసాలో 337, కుంటాలలో 420.1, నర్సాపూర్(జి)లో 453.8, లోకేశ్వరంలో 453.1, దిలావర్‌పూర్‌లో 556.8, సారంగాపూర్‌లో 556.9, నిర్మల్ రూరల్‌లో 459.6, సోన్‌లో 503.1, లక్ష్మణచాందలో 516.9, మామడలో 416, పెంబిలో 515.1, ఖానాపూర్‌లో 441.8, కడెంలో 580.1, దస్తురాబాద్‌లో 416.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

# ఆశల ధర్నా

**నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయింపు**

- కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందజేత
- ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని వినతి

*తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆశ కార్యకర్తలు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ.. ఫిక్స్‌డ్ వేతనం, పీఎఫ్, ప్రమాదబీమా, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పక్షం రోజులు సమ్మె చేయగా ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.* - నిర్మల్ చైన్‌గేట్, జూలై 22



### హామీలను అమలు చేయాలి..

కాంగ్రెస్ ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీలు, ఫిబ్రవరి 9న ఆరోగ్యశాఖ కమిషనర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పారితోషికం రూ.18 వేలకు పెంచి ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆశ వర్కర్లకు ఇన్సూరెన్సు రూ.50 లక్షలు చెల్లిస్తూ సర్క్యులర్ జారీ చేయాలి. రిటర్మెంట్ బెన్‌ఫిట్స్ రూ.5 లక్షలు చెల్లించాలి. ఇస్తున్న పారితోషికాల్లో సగం పెన్షన్ చెల్లించాలి. *- బి.సుజాత, జిల్లా ఆశ కార్యకర్తల యూనియన్ గౌరవ అధ్యక్షురాలు.*

### ఉద్యోగ భద్రత కల్పించాలి..

ప్రభుత్వం ఆశ కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలి. గత ప్రభుత్వం ఇచ్చినట్లు ఆశలకు ప్రతినెల 2న పారితోషికాలు చెల్లించాలి. 18 రకాల రిజిస్టర్లు రాయాలని చెబుతున్నా ఇంతవరకు రిజిస్టర్లు ఇవ్వలేదు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశలకు మట్టి ఖర్చులు రూ.50 వేలు చెల్లిస్తూ సర్క్యులర్ వెంటనే జారీ చేయాలి. యేటా 20 రోజులు వేతనంలో కూడిన సెలవులు ఇవ్వాలి. *- పి.గంగమణి, ఆశ కార్యకర్తల యూనియన్ జిల్లా కార్యదర్శి.*




నిర్మల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు



### ఈనెల 30న చలో హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం హామీలను అమలు చేయకపోతే ఈ నెల 30వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడతామన్నాం. ప్రభుత్వం దిగివచ్చి వెంటనే ఆశల సమస్యలు పరిష్కరించాలి. సమస్యలు పరిష్కరించాలని అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇప్పటివరకు అనేకసార్లు ఆరోగ్య శాఖ మంత్రి, అధికారులకు అనేక వినతులు ఇచ్చాం. రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలిపినా ఇంతవరకు సమస్యలు పరిష్కారం కాలేదు. *- బి. ఇంద్రమాల, ఆశ యూనియన్ నాయకురాలు*

### అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారు..

ఆశ కార్యకర్తలను అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారు. జిల్లా అధికారులు ఆశలతో స్పూటమ్ డబ్బాలను మోయించవద్దని సర్క్యులర్ జారీ చేయాలి. జిల్లా, మండల కేంద్రాల్లో ఆరోగ్య కేంద్రాలు ఉంటాయి. ఆశల పారితోషికాలు గైడ్‌లైన్స్‌కు భిన్నంగా ఏఎన్‌సీ టార్గెట్లు ఎక్కువ చేయాలని ఆశలను వేధింపులకు గురిచేస్తున్నారు. ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ఆశలకు రెస్టు రూంలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెస్టురూంలు కేటాయించిన ప్రాంతాల్లో ఇతరులకు ప్రవేశం కల్పించవద్దు. *- చంద్రకళ, ఆశ కార్యకర్తల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు.*





సమస్యలను పరిష్కరించాలని ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

## సమస్యలకు పరిష్కారం చూపాలి

**ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆశ కార్యకర్తల నిరసన**

ఎదులాపురం, జూలై 22 : ఆశ కార్యకర్తలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అజెండా ప్రవేశపెట్టి, సమస్యల పరిష్కారానికి మార్గం చూపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ హోరెత్తించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రూ.26 వేల వేతనం ఇవ్వాలి



ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఎదులాపురం, జూలై 22 : మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన బాట పట్టారు. పెద్ద పెట్టున నినాదాలతో హోరెత్తించారు. ఈ మేరకు నాయకులు దేవేందర్ మాట్లాడుతూ.. పుర కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఖాళీలను భర్తీ చేయడంతోపాటు భర్తీ ప్రక్రియలో పారిశుధ్య కార్మికులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ధర్నాలో ఏఐటీయూ నాయకులు గజంగుల రాజు, కాంతారావు, చిరంజీవి, అశోక్, పొచ్చిరాం, నారాయణరెడ్డి, సురేశ్, శంకర్, చంద్రశేఖర్, గంగాదేవి, రాధ పాల్గొన్నారు.